సాక్షి ఒడిశా

ఆదివారం । 23 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,21,791
బంగారం	8 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి	17 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



జగన్నాథ్ సాగర్ డ్రెడ్జింగ్ ప్రారంభం

స్థానిక జగన్నాథ్ సాగర్ పునర్నిర్మాణంలో భాగంగా శనివారం డ్రెడ్జింగ్ పనులు జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ప్రారంభించారు.

- 8లో



బడ్జెట్ కేటాయింపులకు ప్రతిపాదనలు

న్యూఢిల్లీలో శనివారం జరిగిన కేంద్ర బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ పాల్గొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఘనంగా తిరువీధి



షిర్డీసాయి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

పర్లాకిమిడి: పౌర్ణమి సందర్భంగా పర్లాకిమిడిలోని రేఖాన వీధిలో షిర్డిసాయి ఉత్సవ విగ్రహంతో శుక్రవారం తిరువీధి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దిశారీలే దిక్కు



దిశారీ నాటు వైద్యం కోసం సీతా శాంతను మోసుకు వెళ్తున్న కుటుంబ సభ్యులు

జయపురం: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ల గడచినా నేటికీ కొరాపుట్ జిల్లా ఆదివాసీ గ్రామీణ ప్రజలు దిశారీలు అనే నాటు వైద్యులపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలోని ఆదివాసీ గ్రామాలకు సరైన రహదారి సదుపాయాలు లేవు. రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే కిలోమీటర్ల కొద్దీ డోలీల్లో మోసుకుంటూ వెళ్లాలి. దీంతో అంత కష్టం భరించలేక నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితి ఉలా పంచాయతీ తెంతులిగుడ గ్రామంలో 65 యేళ్ల సీతా శాంత తీవ్ర అస్వస్థతకు లోనుకాగా ఆయనను డోలీలో మోసుకుంటూ దిశారీ వద్దకు తీసుకెళ్లారు. అతడి కుటుంబ సభ్యుల వివరణ ప్రకారం సీతా శాంత గత నాలుగు నెలల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నారు. వెన్నెముకలో నొప్పితో కదల్లేకపోతున్నారు. దశమంతపూర్ ఆస్పత్రికి వెళ్తే పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కానీ చేతిలో డబ్బుల్లేకపోవడంతో ఇంటికి తీసుకువచ్చి నాటు వైద్యాన్ని ఆశ్రయించారు.

కర్రల లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాయగడ: రాయగడ – ఆంధ్ర రహదారిలో పాత్రపూర్ సమీపంలో కర్రల లోడ్‌తో విజయనగరం నుంచి వస్తున్న లారీ శనివారం అదుపు తప్పి బోల్తా పడింది. బ్రిడ్జిపై ఈ ఘటన జరగడంతో రాయగడ నుంచి పొరుగు రాష్ట్రం మన్యం జిల్లా పార్వతీపురం వరకు సుమారు మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. విజయనగరం నుంచి జేకే పేపర్ మిల్లుకు కర్రలు తీసుకువెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవరు, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. శెశిఖాల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని తొలగించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

రాయగడ: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బిసంకటక్ సమితి నారాలగుడ గ్రామానికి చెందిన సంతోష్ హికక (35) తన స్నేహితుడు కుమార్ మండికతో కలిసి శుక్రవారం కురుంపేటలోని తన అత్తవారింటికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో ఎస్పీతేసు–కురుంపేట రహదారి మధ్య ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే గల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా మండిక గాయాలపాలయ్యాడు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మండికను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కనులపండువగా దేవస్నానం



దేవస్నాన ఉత్సవం సందర్శకులతో శ్రీక్షేత్రం కిటకిట

దేవదేవుళ్లకి స్నాన పూర్ణిమ ఘనంగా జరిగింది. శనివారం భువనేశ్వర్, కొరాపుట్, నబరంగ్‌పూర్, రాయగడ, పర్లాకిమిడి , జయపురం తదితర ప్రాంతాల్లో జగన్నాథ క్షేత్రాలు భక్తులతో కిటకిట లాడాయి. వేద పండితులు జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాలను ఆలయాల బయటకు తీసుకొచ్చారు. మంత్రోచ్ఛారణల మధ్య సుగంధ పరిమళాలతో స్నానం చేయించారు. అనంతరం గణేష్ అవతారంలోనికి మార్చారు. దేవదేవుళ్లను అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

– భువనేశ్వర్/పర్లాకిమిడి/రాయగడ/కొరాపుట్/జయపురం



భువనేశ్వర్: స్నాన వేదికపై చతుర్ధా మూర్తులు



శ్రీజగన్నాథుని మహా జలాభిషేకానికి అలంకరణ



భువనేశ్వర్: అభిషేకం అనంతరం పుష్పాలంకరణలో శ్రీ జగన్నాథుడు



జయపురం: గర్భగుడి నుంచి దేవతామూర్తులను తీసుకొస్తున్న పూజారులు




భువనేశ్వర్: భక్తులకు అభివాదం చేస్తున్న పూరి గజపతి మహా రాజా దివ్యసింగ్ దేవ్



భువనేశ్వర్: కిటకిటలాడుతున్న స్నాన మండపం



భువనేశ్వర్: శ్రీ మందిరం పుష్ప సోయగం



రాయగడ: విద్యుత్ దీపాలంకరణలో జగన్నాథ మందిరం



జయపురం: స్నాన వేదికపై గజరూపాలలో దేవతామూర్తులను అలంకరిస్తున్న దృశ్యం



రాయగడ: గణనాథుని రూపంలో దేవతామూర్తులు



రాయగడ: గుణుపూర్‌లో దేవతామూర్తులు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో దేవస్నాన పూర్ణిమ చేస్తున్న రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠి



కొరాపుట్: ఉమ్మర్‌కోట్‌లో స్వామిని దర్శించుకుంటున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి నిత్యానంద గొండో



పర్లాకిమిడి: దేవస్నానం నిమిత్తం జగన్నాథున్ని మండపానికి తీసుకెళ్తున్న దైతాపతులు



పర్లాకిమిడి: గజానన అవతారంలో జగన్నాథుడు



పర్లాకిమిడి: ఘట్టాన్ని తిలకించడానికి విచ్చేసిన అశేష భక్తజనం

మళ్లీ మావోల బ్యానర్లు



అలమండలో మావోయిసు బ్యానర్



సనసరిపల్లి కూడలిలో మావోల బ్యానర్

జయపురం: ఒకప్పుడు మావోయిస్టులకు అడ్డాగా ఉన్న కొరాపుట్ జిల్లా బందుగాం సమితిలో చాలా ఏళ్ల తర్వాత వారి కదలికలు మళ్లీ కనిపిస్తున్నాయి. బందుగాం సమితి ప్రధాన కూడలి, అలమండ పంచాయతీ అలమండ గ్రామం హనుమాన్ మందిరం సమీప మహాత్మాగాంధీ విగ్రహం వద్ద, అలాగే బొడొసరిపల్లి పంచాయతీ పరిధిలోని సనసరిపల్లి కూడలి వద్ద, కబ్రిబొడి పంచాయతీకి వెళ్లే రహదారిలోని పలు ప్రాంతాల్లో మావోయిస్టుల బ్యానర్లు కనిపించాయి. ఆ బ్యానర్లలో స్థానిక బీజేడీ నేత, అటవీ విభాగ అధికారులను హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల కోసం వచ్చే ఆహార సామగ్రి సక్రమంగా కేంద్రాలకు పంపించడం లేదని, ప్రతి పంచాయతీలో లబ్ధిదారులు తమకు రావాల్సిన పెన్షన్ల కోసం ఇబ్బంది పడుతున్నారని, వారికి సకాలంలో పెన్షన్లు అందజేయాలని సూచించారు. సీపీఐ మావోయిస్టు చత్తీస్‌గఢ్, శ్రీకాకుళం, కొరాపుట్ డివిజన్ కమిటీ అన్న పేరుతో ఉన్న బ్యానర్లు చూసి ప్రజలు భీతిల్లారు. గతంలో మావోయిస్టు నక్సలైట్లు, చాసీ మూలియ ఆదివాసీ సంఘాల కార్యకలాపాల వలన అట్టుడికిన బందుగాం, నారాయణపట్న సమితుల్లో కొంత కాలంగా ప్రశాంతత నెలకొంది. అయితే నేడు మళ్లీ బ్యానర్లు కనిపించడంతో ప్రజలు, అధికారులు ఉలిక్కి పడ్డారు.

విత్తన విక్రేతలతో చర్చలు



విత్తన విక్రేతలతో వ్యవసాయ అధికారుల సమావేశం

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లోగల వ్యవసాయ విత్తనాల విక్రేతలతో జయపురం వ్యవసాయ విభాగ అధికారులు శుక్రవారం సాయంత్రం చర్చలు జరిపారు. ప్రభుత్వ విత్తనాల కంటే ప్రైవేటు దుకాణాల వద్దే రైతులు ఎక్కువగా విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో అధికారులు ప్రైవేటు వర్తకులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ నియమం ప్రకారం వ్యవసాయం అభివృద్ధికి, ప్రభుత్వ విత్తనాల విక్రయాలు పెరగాలని అందుకు విక్రేతలు సహకరించాలని అగ్రికల్చర్ విభాగ జిల్లా అధికారి లోచన చంద్ర మఝి విజ్ఞప్తి చేశారు. స్థానిక వ్యవసాయ జిల్లా సభాగృహంలో జరిగిన ఈ సమావేశంలో జయపురం, కొట్‌పాడ్, బొరిగుమ్మ, బొయిపరిగుడ, కుంద్రా సమితిల నుంచి 50 మంది ప్రభుత్వ అనుమతి పొందిన విత్తన విక్రేతలు పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి లోచన చంద్ర మఝి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ విత్తనాల విక్రయంపై ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు సమకూరుస్తున్నా రైతులు లబ్ధి పొందలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం సమకూర్చుతున్న విత్తనాలను విక్రేతలు తీసుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాల విక్రయంలో సమస్యలు, ఆన్‌లైన్ చేయడం, రైతు, డీలర్లకు లభించాల్సిన సబ్సిడీ, విత్తనాల కోసం ముందుగా డబ్బుల చెల్లింపు తదితర విషయాలను విక్రేతలు అధికారులకు వివరించారు. సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో ఏడీఏ కహ్నా సాహు, ఎస్పీఓ శితి కృష్ణ దాస్, ప్రభుత్వ వ్యవసాయ అధికారి పూర్ణ చంద్ర బురిడి, స్మిత పాఢీ, బొయిపరిగుడ నుంచి నందు జాని, కొట్‌పాడ్ నుంచి మనోలిస మఝి, బొరిగుమ్మ నుండి సూరజ్ కుమార్ బెహర, రామగిరి నుంచి అలోక్ రంజన్ బెహర, జిల్లా కేంద్రం నుంచి దివ్య రంజన్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి అలార నాథుని దర్శనం



బ్రహ్మగిరిలో చందన లేపిత అలార నాథ స్వామి

భువనేశ్వర్: పూరీ జిల్లా బ్రహ్మగిరి ప్రాంతంలో కొలువైన అలారనాథ స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి రద్దీ పెరుగుతుంది. అట్టహాసంగా మహా జలాభిషేకం ముగిసిన తర్వాత మేళతాళాల ధ్వానాల మధ్య స్నాన మండపం నుంచి శ్రీమందిరానికి చేరిన స్వామి అస్వస్థతకు గురవుతాడు. భారీ స్నానం కారణంగా స్వామివారు జ్వరం బారి నపడి తెరమరుగు కావడం ఆచారం. ఈ నేపథ్యంలో స్వామికి గోప్య ఔషధ, వైద్య ఉపచారాలు నిర్వహిస్తారు. పక్షం రోజులపాటు ఈ సేవలు నిరవధికంగా కొనసాగడంతో స్వామి పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటాడు. అంతవరకు భక్తుల దృష్టిలో పడకుండా గోప్య మండపంలో విశ్రమిస్తాడు. ఈ వ్యవధిలో శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటుల దర్శనం భక్తులకు లభించదు. తిరిగి నేత్రోత్సవం పురస్కరించుకుని 15 రోజుల తర్వాత స్వామి దర్శనం యథాతథంగా ప్రాప్తిసుంది. ఈ సమయంలో, భక్తులు సమీపంలోని బ్రహ్మగిరిలో పూజలందుకుంటున్న అలరనాథుని దర్శనం చేసుకుంటారు. ఈ స్వామిని దర్శించుకోవడంతో శ్రీ జగన్నాథుని ఏడాది పొడవునా దర్శించిన పుణ్య ఫలం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం.

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



రోడ్డుపై విగతజీవిగా చక్రధర్

రాయగడ: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ బొడొమత్రిభొట్టా గ్రామంలో చోటుచేసుకుంది. కాసీపూర్ ఇందిరా కాలనీలో నివాసముంటున్న చక్రధర్ నాయక్ (25) శనివారం ఉదయం తన స్కూటీతో టికిరి వెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన చక్రధర్‌ను ఉషాపాడు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొరాపుట్‌లోని లక్ష్మణ్ నాయక్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చక్రధర్ మృతి చెందాడు. పోలీసులు /దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన నాగమణి (ఫైల్)

ఎచ్చెర్ల: లావేరు మండలం చిన్నమురపాక గ్రామానికి చెందిన సిరుపురపు నాగమణి (35) అనే మహిళ ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే నాగమణికి భర్త సెల్లయ్యకు మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఎప్పటిలాగానే గురువారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భర్త మందలించడంతో క్షణికావేశానికి గురైన నాగమణి ఇంటిలోకి వెళ్లి గడియ పెట్టుకుని లుంగీ పంచెతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. అయితే వెంటనే స్పందించిన భర్త, కుటుంబ సభ్యులు తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లి ఆమెను కిందకు దించారు. వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈమెకు గ్రీష్మ (13) రమ్య (11) అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నాగమణి తండ్రి ఫిర్యాదుమేరకు లావేరు ఎస్‌ఐ స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, కుమార్తెలు అదృశ్యం




అదృశ్యమైన భార్య, పిల్లలు (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: తన భార్యతో పాటు తన ఇద్దరు కుమార్తెలు అదృశ్యమయ్యారంటూ శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డొంకూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు చీకటి చంద్రయ్య ఈ నెల 13న భార్య రాము లమ్మ, 8, 5 ఏళ్ల వయస్సున్న కుమార్తెలను తన తల్లిదండ్రుల వద్ద తోడుగా ఉంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లిపోయాడు. అదే రోజు సాయంత్రం వేట నుంచి ఇంటికి తిరిగి వచ్చే సమయానికి ఇంటి వద్ద భార్య, పిల్లలు లేకపోవడంతో కుటుంబ సభ్యులతో కలసి చంద్రయ్య బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్దకు వెళ్లి వాకబు చేశారు. మరుసటి రోజు నుంచి వివిధ గ్రామాల్లో గాలించినప్పటికీ జాడ కనిపించలేదు. దీంతో శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి భర్త చంద్రయ్య ఫిర్యాదు చేశారు.



గజ ముఖ అలంకరణలో జగన్నాథుడు



గజ ముఖ అలంకరణలో బలభద్ర స్వామి



పద్మ అలంకరణలో దేవీ సుభద్ర

గజ ముఖ దర్శనం.. పులకించిన భక్తజనం

- ఘనంగా జగన్నాథుని స్నానోత్సవం
- తండోపతండాలుగా తరలి వచ్చిన భక్తులు
- రద్దీ నియంత్రణకు ట్రాఫిక్ ఆంక్షలు

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని భక్తులకు స్వామి గజముఖ అలంకరణలో దర్శనమిచ్చారు. ఏటా జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని నిర్వహించే స్నాన యాత్రలో భాగంగా భారీ జలాభిషేకం తర్వాత దేవతామూర్తుల్ని గజముఖ అలంకరణ చేస్తారు. ఇది గజానన అలంకరణగా ప్రసిద్ధి. స్థానికుల ఈ అలకరణని హత్తి బెషొగా వ్యవహరిస్తారు. స్నాన మండపంపై మూల విరాటుల గజ ముఖ అలంకరణ కోసం అవసరమైన సామగ్రి సరంజామా స్థానిక రాఘవ దాస్ మఠం ఏర్పాటు చేస్తుంది. ఏటా అక్షయ తృతీయ పురస్కరించుకుని అలంకరణ సామగ్రి తయారీ చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీ జగన్నాథుడు, బలభద్రుని కోసం గజ ముఖ సామగ్రి, వారి తోబుట్టువు సుభద్ర దేవి కోసం పద్మ అలంకరణ సామగ్రి ఈ మఠం సరఫరా చేస్తుంది. ఈ సందర్భంగా అన్నదమ్ములు గజాననులుగా సోదరి సుభద్ర పద్మ అలంకరణలో దర్శనం ఇవ్వడం విశేషం.

పరిశోధకుల కథనం..

15వ శతాబ్దంలో మహాగణపత్య సమాజానికి చెందిన పండిట్ గణపతి భట్ జగన్నాథుని దర్శనం కోసం పూరీ పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. స్నాన పూర్ణిమ నాడు స్నాన మండపంపై చతుర్ధామూర్తుల్ని ఆయన దర్శించుకున్నారు. అయితే జగన్నాథునిలో గణపతి దేవుని దర్శనం చేసుకోవాలనే కోరికతో ఆయన అసంతృప్తితో వెనుదిరిగారు. తిరుగు ప్రయాణంలో ఉండగా, జగన్నాథుడు పూజారి వేషంలో ప్రత్యక్షమై తన అభీష్టం మేరకు గణేశుడిని దర్శించుకునేందుకు తిరిగి ఆలయానికి వెళ్లమని ఆన చేసి అదృశ్యమయ్యాడు. స్వామి ఆన మేరకు ఆలయానికి తిరిగి వచ్చిన పండిట్ గణపతి భట్‌కు శ్రీ జగన్నాథుని స్థానంలో ఇష్ట దైవం గణనాథుడు ప్రత్యక్షమైనట్లు గుర్తించడంతో ఏటా ఈ అలంకరణ నిర్వహిస్తున్నారు. భక్తుల కోరిక మేరకు స్వామి ప్రత్యక్షం అవుతాడనే విశ్వాసాన్ని ఈ అలంకరణ మరింత బలపరుస్తుంది.

శాస్త్రోక్తంగా స్నానోత్సవం..

అంతకుముందు పటిష్టమైన భద్రతా వ్యవస్థ మధ్య జగన్నాథుని స్నాన యాత్రని విజయవంతంగా నిర్వహించారు. శ్రీ మందిరం అంతరాలయం రత్న వేదికపై ఆసీనులైన మూల విరాటుల్ని శాస్త్రోక్తంగా నిర్వహించిన ఊరేగింపులో స్నాన మండపానికి తరలించారు. శనివారం ఉదయం 4 గంటలకు ప్రారంభమై 6 గంటల ప్రాంతంలో ఈ కార్యక్రమం ముగిసింది. మూల విరాట్ల తరలింపు పురస్కరించుకుని మారు మోగే ఘంటా నాదం మధ్య భక్తుల జయ జగన్నాథ్ నినాదంతో ఉత్సవ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణం అలముకుంది. ఆలయంలో దేవతా మూర్తులను ప్రతిష్ఠించినప్పుడు ఇంద్రద్యుమ్నుడు మొదటిసారిగా ఈ వేడుక ఏర్పాటు చేసినట్లు పౌరాణిక కథనం.

ప్రత్యేక ఆంక్షలు..

స్నాన యాత్ర సందర్భంగా ప్రధాన ఆలయంలో దేవతా మూర్తుల దర్శనం పట్ల ప్రత్యేక ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి మర్నాడు మూల విరాట్ల పొహండి ముగిసేంత వరకు భక్తులకు సర్వ దర్శనం నియంత్రించారు.

పటిష్టమైన పోలీసు భద్రత..

స్నాన యాత్ర ప్రత్యక్షంగా తిలకించేందుకు మారుమూల ప్రాంతాల నుంచి భారీగా యాత్రికులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పూరీ జిల్లా, పోలీసు యంత్రాంగం 68 ప్లటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. హెల్ప్‌లైన్ నంబర్ 6370967100 అందుబాటులోకి తీసుకొచ్చారు.

వాహనాల నియంత్రణ..

యాత్ర సందర్భంగా పూరి పట్టణ వ్యాప్తంగా వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు పలు ట్రాఫిక్ నిబంధనలు జారీ చేశారు. భువనేశ్వర్, కోణార్క్ నుండి నిత్య ప్రయాణికుల బస్సులు యథాతథంగా మున్సిపాలిటీ బస్టాండ్‌లోకి ప్రవేశించడానికి అనుమతించారు. మార్కెట్ స్క్వేర్ నుంచి జొగ్గా బలియా లాడ్జ్ వరకు, శ్రీ మందిరం నలు వైపుల వాహనాలు నిలపడం నివారించారు. పాస్ హోల్డర్ వాహనాలు, మోటార్ సైకిల్, అత్యవసర వాహనాలు, అధికారిక వాహనాల్ని మాత్రమే ఈ పరిసరాల్లో నిలిపేందుకు అనుమతించారు.

స్వామి తొలి సేవకుడు గజపతి మహా రాజా



స్నాన మండపంపై జగన్నాథుని వింజామర సేవలో పూరి గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్

భువనేశ్వర్: జగతి నాథుని తొలి సేవకుడు పూరీ గజపతి మహారాజా. శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. స్వామి రథ యాత్ర ఇతరేతర ప్రత్యేక ఉత్సవాల్లో వర్ధమాన గజపతి మహారాజు తొలి సేవకుడిగా పాల్గొనడం విశేషం. స్వామి ఆసీనుడైన ప్రాంగణం చీపురుతో ఊడ్చే శుద్ధి ప్రక్రియను మహా రాజా స్వయంగా నిర్వహిస్తారు. అనంతరం స్వామికి వింజామర సేవ చేసి మనసారా దర్శించుకుంటారు. దీని ప్రకారం శనివారం జరిగిన స్నానయాత్రలో పూరి గజపతి మహా రాజా దివ్యసింగ్ దేవ్ స్నాన మండపంపై జగన్నాథుని తొలి సేవకునిగా స్నాన మండపం శుద్ధి ప్రక్రియ (ఛెరా పొంహరా) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



వాన జల్లు రక్షణతో స్నానోత్సవం తిలకిస్తున్న భక్త జనం

ఆహ్లాద భరితం

భువనేశ్వర్: గత కొద్ది రోజులుగా విపరీతమైన ఉక్కపోత, వేడి గాలులతో ప్రజానీకం అల్లాడిపోయింది. ఈ క్రమంలో స్వామిని గజ ముఖ అలంకరణలో దర్శించుకోవాలని మారుమూల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. బొడొ దండొ కిటకిటలాడి ఊపిరాడని పరిస్థితి నెలకొంది. ఇంతలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి చిరు జల్లులు కురిశాయి. దీంతో భక్త జనం ఆహ్లాదభరితమైన వాతావరణం మధ్య స్వామిని కనులారా దర్శించుకున్నారు.



మూల విరాటులకు సుబాషిత జలాభిషేకం దృశ్యం

అష్టోత్తర కలశ అభిషేకం

భువనేశ్వర్: నిత్యం రత్న వేదికపై దైనందిన ఉపచారాలు పొందే జగన్నాథుడు ఏటాస్నాన యాత్ర సందర్భంగా ఆరు బయట మండపంపై భక్తుల సమక్షంలో స్నానం ఆచరించడం ప్రత్యేకత. ఈ సందర్భంగా ప్రధాన దేవస్థానం సముదాయంలో ఉన్న బంగారు బావి నుంచి పవిత్ర జలం సేకరిస్తారు. ఇక్కడి నుంచి సేకరించిన అష్టోత్తర శత (108) కలశాల సుభాషిత జలంతో మూల విరాట్లకు జలాభిషేకం చేయడం ఉత్సవ ఇతివృత్తం. వీటిలో జగన్నాథునికి 35, బలభద్రునికి 33, దేవీ సుభద్రకు 22, సుదర్శనునికి 18 కలశాల సుభాషిత జలంతో అభిషేకిస్తారు.

జగన్నాథ్ సాగర్ డ్రెడ్జింగ్ ప్రారంభం



జగన్నాథ్ సాగర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి



సాగర్‌లో నీటిని, బురదను తొలగిస్తున్న ప్రత్యేక యంత్రం

జయపురం: స్థానిక జగన్నాథ్ సాగర్ పునర్నిర్మాణంలో భాగంగా శనివారం డ్రెడ్జింగ్ పనులు ప్రారంభించారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కొబ్బరి కాయ కొట్టి లాంఛనప్రాయంగా ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ డుడా దేవి, ప్రసాద్ టాలీ, జయపురం సమితి బీడీఓ శక్తి మహాపాత్రో, మున్సిపాలిటీ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మున్సిపాలిటీ జూనియర్ ఇంజినీర్ ప్రతాప్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు పడక ముందే జగన్నాథ్ సాగర్‌లో బురద తీసే కార్యక్రమం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రెడ్జింగ్ ద్వారా నీరు, బురదలను ఒకేసారి బయటకు తొలగించవచ్చని బురద పూర్తిగా తొలగించిన తర్వాత సాగర్ సౌందర్యీకరణ పనులు చేపట్టనున్నట్లు బాహిణీపతి వెల్లడించారు. జగన్నాథ్ సాగర్ పనులు 85 స్వయం సహాయక గ్రూపులకు అప్పగించటం జరిగిందని, రూ.14 కోట్ల 87 లక్షల వ్యయంతో సాగర్ నుంచి నీరు, బురద తొలగించి సౌందర్యీకరణ పనులు చేపడతామని ఆయన వెల్లడించారు.

'మునిషిపొదొరొ గ్రామస్తులను ఆదుకోండి'



మునిషిపొదొరొ గ్రామస్తులతో మాట్లాడుతున్న ముదులి

రాయగడ: మునిషిపొదొరొ గ్రామస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాయగడ శాసనసభ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మకరంద ముదులి డిమాండ్ చేశారు. దిఫ్తీరియా వ్యాధి బారిన పడి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన శనివారం గ్రామంలో పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆయన ఈ మేరకు విలేకరులతో మాట్లాడారు. మౌలిక సౌకర్యాలు మెరుగు పరచడంతో పాటు గ్రామంలోని చిన్నారులకు పౌష్టికరమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. వ్యాధి ప్రబలుతున్న కారణంగా భయభ్రాంతులకు గురైన గ్రామస్తులకు ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు. ప్రస్తుతం గ్రామంలో గల చిన్నారులకు వండిన పౌష్టికరమైన ఆహారాన్ని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మౌలిక సౌకర్యాల లేమి కారణంగా ఈ సమితిలో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

బడ్జెట్ కేటాయింపులకు ప్రతిపాదనలు



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్

- కేంద్ర ఆర్థికమంత్రికి విన్నవించిన డిప్యూటీ సీఎం కనకవర్ధన్ సింగ్ దేవ్

భువనేశ్వర్: న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శనివారం జరిగిన కేంద్ర బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఎన్నికల హామీల వాస్తవ కార్యాచరణకు అనుగుణంగా బడ్జెటు కేటాయింపుల కోసం మంత్రి ప్రతిపాదించడం విశేషం. రాష్ట్ర ఆర్థిక, అభివృద్ధి సంబంధిత అంశాలకు కేంద్ర బడ్జెట్‌లో తగిన చర్య కోసం కేంద్ర ఆర్థిక మంత్రికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి లిఖితపూర్వకంగా మెమోరాండం సమర్పించారు. ఆయనతో పాటు ఆర్థిక కార్యదర్శి విశాల్ దేవ్ ఉన్నారు.

ప్రధాన ప్రతిపాదనలు

అంతర్జాతీయ పెట్టుబడులను ఆకట్టుకునే దిశలో బడ్జెటు కేటాయింపులను ప్రతిపాదించారు. రాష్ట్రంను పెట్టుబడి కేంద్రంగా సరైన ప్రచారం చేయడంతో పాటు సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటు, పారాదీప్ పోర్ట్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మద్దతు కోరారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయం (ఎస్ఏసీఐ) పథకం కింద రాష్ట్రానికి ప్రాధాన్య ప్రాతిపదిక కేటాయింపులు ఆకాంక్షించారు. రాష్ట్రాలు తమ బడ్జెట్‌లను వాస్తవిక ప్రాతిపదికన మరియు సకాలంలో నిధుల వినియోగంలో సిద్ధం చేయడంలో సహాయపడేందుకు కేంద్ర బడ్జెట్‌లో సీఎస్ఎస్ పథకం కింద రాష్ట్రాల వారీగా వార్షిక కేటాయింపులను అభ్యర్థించారు. పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్‌లో 2వ ఎయిమ్స్ ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో తగిన కేటాయింపులు అనివార్యంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో తీర ప్రాంతపు హైవే, రాజధాని ప్రాంత రింగ్ రోడ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడానికి తగిన చర్యలు వివరించారు. సుభద్ర యోజన ద్వారా మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం పాక్షిక మద్దతుని ప్రతిపాదించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు కనీసం 5 లక్షల పక్కా ఇళ్ల నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు కోరారు. రాష్ట్రంలో విద్యుత్ రంగ సమస్యలను పరిష్కరించడానికి ఒడిశా విద్యుత్ పంపిణీ సంస్థలను (డిస్కామ్‌లు) సవరించిన పంపిణీ రంగ పథకం కింద చేర్చడం, గ్రీన్ హైడ్రోజన్ వంటి కొత్త సాంకేతికతలకు ఆర్థిక సహాయం మరియు రాష్ట్రంలో హరిత విద్యుత్ కారిడార్ ప్రాజెక్టులకు కేంద్ర నిధులు అవసరంగా పేర్కొన్నారు.

సాఫీగా ప్రయాణిద్దాం

- రైలు ప్రయాణికులకు 'మదద్' సాయం
- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక యాప్ రూపకల్పన
- 35 రకాల సేవా లోపాలపై ఫిర్యాదు చేయవచ్చు

హిరమండలం: రైలు ప్రయాణంలో ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు రైల్ 'మదద్' పేరిట కొత్త యాప్‌ను రైల్వే శాఖ అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ప్రయాణ సమయంలో 35 రకాల సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేయవచ్చు. సమస్యను వివరించడంతో పాటు సంబంధిత ఫొటోను అప్‌లోడ్ చేసేలా యాప్‌ను రూపకల్పన చేశారు. ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే ప్రయాణికులు రిజర్వేషన్, జనరల్, ప్లాట్‌ఫాం టికెట్‌లో ఏదో ఒక దాన్ని తప్పనిసరిగా తెలియజేయాలి. ప్రతి ఫిర్యాదుపై రైల్వే అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడతారు.

ఏయే సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు

రైల్వే స్టేషన్‌లో అపరిశుభ్రమైన వాతావరణం, నీటికొరత, వెయిటింగ్ హాల్‌లో సౌకర్యాల కొరత, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండటం, టీటీ ఇతర సిబ్బంది అవినీతి, రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వస్తువుల అపహరణ, గొలుసు దొంగతనాలు, కొట్లాటలు, మద్యపానం, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన, ఆకతాయిల వేధింపులు, మరుగుదొడ్లు, బోగీల అపరిశుభ్రత, నాణ్యత లేని ఆహారం, ప్యాంట్రీ కార్‌లో అపరిశుభ్రత, అధిక ధరలకు అమ్మడం, ఏసీ, లైట్లు, చార్జింగ్ పాయింట్లు పనిచేయకపోవడం, రైళ్ల రాకపోకల్లో ఆలస్యం, తదితర అంశాలపై యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి?

గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వ్యక్తిగత వివరాలు నమోదు చేయడం ద్వారా సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓ టీపీ నమోదు చేయగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ము గిసి యాప్ వినియోగానికి వీలవుతుంది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న 35 రకాల సేవా లోపాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఆ ధారాల కోసం ఫొటోలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. అలాగే సంబంధిత అంశంపై ఎలాంటి చర్యలు చేపడితే బాగుంటుందో తెలుపుతూ సూచనలు ఇవ్వవచ్చు. ప్రతి ఫిర్యాదుకు ఒక రిఫరెన్స్ నంబర్ ఉంటుంది. ఈ నంబర్ ఆధారంగా తమ ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే వెసులుబాటు ఉంది. సమస్య పరిష్కారం కాగానే ఫిర్యాదుదారుకు ఎస్ఎంఎస్, ఈమెయిల్ ద్వారా సమాచారం అందజేస్తారు.



రైల్వే మదద్ యాప్

నిరంతర పర్యవేక్షణ

రైల్ మదద్ యాప్‌పై రైల్వే అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. యాప్‌లో చేసిన ప్రతి ఫిర్యాదు వెంటనే రైల్వే జనరల్ మేనేజర్, డివిజనల్ మేనేజర్‌కు చేరుతుంది. ఫిర్యాదు స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ముఖ్య అధికారిని అప్రమత్తం చేస్తారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తారు.

క్లుప్తంగా

వైభవంగా జ్యేష్ఠ పౌర్ణమి



స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామ స్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో హోమాలు చేపట్టి సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం ఉష్ణతాపం తగ్గాలని ఆకాంక్షిస్తూ స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు చేపట్టారు. ఉత్సవ మూర్తుల వద్ద విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవ కలశారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి ఒకరి మృతి



ఉమామహేశ్వరరావు మృతదేహం

నెల్లిమర్ల రూరల్: విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి కేబుల్ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన నెల్లిమర్ల మండలంలోని ఆల్తిపాలెం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒమ్మి గ్రామానికి చెందిన వడ్డాది ఉమామహేశ్వరరావు(39) ఏపీ ఫైబర్‌నెట్‌లో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఆల్తిపాలెంలో కేబుల్ వైర్లు తెగిపోవడంతో మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లాడు. గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేపడుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అయన్ను కేంద్రాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడికి భార్య రూపావతి, కుమార్తె, కుమారుడున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రామగణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

సీతంపేట: మండలంలోని ఆడలి వ్యూ పాయింట్ సమీపంలో శనివారం రాత్రి ఆటో బోల్తాపడిన సంఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి ఆడలి గ్రామానికి గృహప్రవేశానికి వచ్చిన వీరంతా తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా మార్గమధ్యలో ఘాట్ రోడ్‌లో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఐదుగురిని శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు.

నేడు ఒలింపిక్ డే రన్

విజయనగరం: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదివారం ఒలింపిక్ డే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు నగరంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే ఈ రన్ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సాగుతుందని చెప్పారు. ఈ రన్‌ను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు ప్రారంభిస్తారని, క్రీడాకారులు, క్రీడాసంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

రేగిడి: మండలంలో నాగావళి నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అధికారులు పట్టుకుంటున్నారు. మండలంలోని సంకిలి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లతో పాటు బూరాడ ప్రధాన రహదారి మీదుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మరో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ రాములమ్మ శనివారం విలేకరులకు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. పట్టుకున్న ఐదు ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీసులకు అప్పగించామన్నారు.

గ్రామాల్లో 'గజ'గజ

గరుగుబిల్లి: వారం రోజుల నుంచి గరుగుబిల్లి మండలంలోని గిజబ, నందివానివలస, సంతోషపురం, ఖడ్గవలస, సుంకి తదితర గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. రెండు రోజుల నుంచి సుంకి గ్రామంలోని పంట పొలాల్లో తిష్టవేశాయి. గ్రామంలోని పెనుగంటి గౌరునాయుడికి చెందిన ధాన్యం నిల్వలను ధ్వంసం చేశాయి. అలాగే అరటి, కొబ్బరి మొక్కలను నేలమట్టం చేశాయి. ఈ నేపథ్యంలో చీకటి పడితే బయటకు వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలు భీతిల్లుతున్నారు. రాత్రి సమయంలో దాడి చేస్తాయోమోనని, ఏ పంటలను నాశనం చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారులు ఏనుగులను తరలించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

షాక్ కొడుతున్నాయ్..

- అస్తవ్యస్తంగా విద్యుత్ కనెక్షన్లు
- వర్షాకాలంలో యమపాశాలుగా మారే ప్రమాదం
- జాగ్రత్తలు తప్పనిసరి : అధికారులు



పొలంలోకి ఒరిగిన విద్యుత్ స్తంభం



విద్యుత్ లైన్లలో లోపాలు సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది (ఫైల్)

పాలకొండ రూరల్ : ఇటీవల పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన రైతు ఆలుబిల్లి అప్పలనాయుడు తన పంటకు మోటారు ద్వారా నీరు అందించేందుకు వేకువజామున పొలానికి వెళ్లాడు. పంపుసెట్ ఆన్‌చేసిన వెంటనే విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా పంప్ సెట్‌ను తాకడమో... అస్తవ్యస్త విద్యుత్ కనెక్షన్లో.. కారణం తెలియదు గాని ఓ వ్యక్తి నిండు ప్రాణం బలైంది. ఇది కేవలం ఓ ఉదాహరణ మాత్రమే. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వేల మంది రైతు కుటుంబాలు ప్రస్తుత వర్షాలను నమ్ముకుని వ్యవసాయానికి పొలంబాట పడుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్లు ప్రస్తుత సీజన్‌లో యమపాశాలుగా మారి ప్రాణాలను బలిగొనే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుత సీజన్‌లో అన్ని వర్గాల ప్రజలు విద్యుత్ సంబంధిత పరికరాలతో పొంచి ఉన్న ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రోజు రోజుకూ జనావాసాలు విస్తరిస్తుండడంతో గృహాలు, దుకాణాలకు అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. ప్రధాన రహదారుల్లో, ఇరుకైన కూడళ్లలో విద్యుత్ తీగలను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎప్పటికప్పుడు విద్యుత్ షాక్‌ల కారణంగా సాధారణ ప్రజలు, రైతులు, మూగజీవాలు మృత్యువాత పడడం, క్షతగాత్రులుగా మారడం జరుగుతోంది. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, ప్రజలు సంయుక్తంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

పొలాల్లో ప్రమాదభరితంగా...

విద్యుత్ విస్తరణలో భాగంగా గ్రామీణ ప్రాంత పంట పొలాల మీదుగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు జరిగింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు, గాలులు కారణంగా స్తంభాలు ఒరిగిపోవడం ద్వారా విద్యుత్ తీగలు కొంతమేర కిందకు వేలాడుతున్నాయి. దీనికితోడు పొలాలకు నీరుకట్టే క్రమంలో ఏర్పాటు చేసుకున్న పంపుసెట్లు షెడ్లలో రైతులు కచ్చితమైన ప్రమాణాలు పాటించకపోవడం పరిపాటిగా మారింది. ఈ తరహా పరిస్థితుల వల్ల ప్రస్తుత వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉంది. నియోజకవర్గంలో రైతులకు సంబంధించి విద్యుత్ 2,700, అన్నిరకాల విద్యుత్ వినియోగ కనెక్షన్లు సుమారు 68 వేల వరకు ఉన్నాయి. వీటికి సంబంధించి 28 వేల విద్యుత్ స్తంభాలు ఉండడంతో నిరంతర పర్యవేక్షణ జరపడం కష్టతరంగా మారింది. ఈ క్రమంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. రైతులతో పాటు సాధారణ విద్యుత్ గృహోపకరణాలు, ఇళ్లలో వాడుకునే ఫ్రిజ్‌లు, రిఫ్రిజిరేటర్లు, మిక్సీలు, గ్రైండర్ల వాడకంలో జాగ్రత్తలు అవసరం.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- పంపుసెట్లు వద్ద ఏర్పాటు చేసుకున్న విద్యుత్ బోర్డులపై నీరు చేరకుండా ప్లాస్టిక్ కవర్లతో రక్షణ కల్పించుకోవాలి.
- మోటారు ఉన్న ప్రాంతంతో పాటు విద్యుత్ స్విచ్ బోర్డు తడవకుండా చూసుకోవాలి.
- పొలంలో విద్యుత్ పరికరాలు వినియోగించే సమయంలో చేతికి, కాళ్లకి రబ్బరు గ్లౌజులు, చెప్పులువాడటం శ్రేయస్కరం.
- విద్యుత్ స్విచ్ బోర్డులకు సంబంధించి నాణ్యమైన వైర్లు వాడాలి. అలాగే ముందుగా గుర్తించిన చిన్న చిన్న సమస్యలను ఎలక్ట్రీషియన్ల ద్వారా పరిష్కరించుకుంటే మేలు.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి.
- పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను గుర్తించినా, ప్రమాదం ఉందని భావించినా తక్షణమే విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించాలి.
- రైతులతో పాటు గృహ విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.
- ఇళ్ల పైభాగంలో, శ్లాబులకు దగ్గరగా విద్యుత్ తీగలుంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన చర్యలు చేపట్టాలి.

అవగాహన తప్పనిసరి



ప్రస్తుత సీజన్‌లో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఈ క్రమంలో మా సిబ్బంది క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కస్తున్నారు. ముఖ్యంగా పొలాల్లో సంచరించే రైతులు, మూగజీవాల పెంపకందారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. సమస్యలు గుర్తించిన వెంటనే అధికారులుకు తెలియజేయాలి. విద్యుత్ వినియోగదారులు అవగాహనతో వ్యవహరించడంతో పాటు సహచరులకు జాగ్రత్తలపై సూచనలు చేయాలి. – టి.గోపాలకృష్ణమూర్తి, ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పాలకొండ.

ఉద్యానవన కోర్సులతో మంచి భవిష్యత్

- ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ జానకీరామ్



లోగో ఆవిష్కరిస్తున్న వీసీ జానకీరామ్

గరుగుబిల్లి : ఉద్యాన వన కోర్సులతో విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను ఉంటుందని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ జానకీరామ్ అన్నారు. ఉల్లిభద్రలో గల వైఎస్సార్ ఉద్యాన కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ జానకీరామ్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో ఉద్యాన కళాశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కళాశాలలో చదువుకున్న వారెందరో ఉన్నత శిఖరాలు అధిరోహించారని చెప్పారు. అనంతరం కళాశాల లోగోను ఆవిష్కరించారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ నరసింహమూర్తి, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

గోవులను రక్షించండి..



కరాటే కల్యాణితో చర్చిస్తున్న కొత్తవలస సీఐ చంద్రశేకర్

- గనిశెట్టిపాలెం గోశాల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు
- సినీ ఆర్టిస్ట్ కరాటే కల్యాణి ఆందోళన
- సీఐ జోక్యంతో ఆందోళన విరమణ

కొత్తవలస : మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న గోశాలలో నిబంధనలు పాటించడం లేదని, వెంటనే గోశాలను మూసి గోవులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ధార్మిక సంఘం తెలంగాణ స్టేట్ జాయింట్ కన్వీనర్, సినీ ఆర్టిస్ట్ కరాటే కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం గోశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గోశాలలో ఉన్న గోవులు మాయం అవుతున్నాయని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు. రెండు నెలల కిందట శ్రీకాకుళం జిల్లాలో నరసన్నపేట సమీపంలో అక్రమంగా రవాణ చేస్తున్న సుమారు 150 గోవులను పట్టుకొని అక్కడి పోలీసులకు అప్పజెప్పామన్నారు. అయితే పోలీసులు ఆ గోవులను గనిశెట్టిపాలెం గోశాలకు తరలించారని తెలిపారు. నాలుగు రోజుల తర్వాత గోశాలకు వచ్చి చూస్తే ఒక్క ఆవుకూడా లేదని.. ఇదే విషయమై గోశాల నిర్వాహకులను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెప్పారన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 70 గోవులను శనివారం తాము పట్టుకుని, నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్‌కు అప్పజెప్పామని తెలిపారు. అయితే ఈ గోవులను గనిశెట్టిపాలెం గోశాలకు మాత్రం తరలించవద్దని చెప్పినా, పోలీసులు మా మాట పట్టించుకోకుండా ఇక్కడకే తరలించారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై అనుమానం వచ్చి తాము ఇక్కడకు రాగా.. కనీసం ఆవులకు నీరు, గడ్డి కూడా పెట్టలేదన్నారు. పైగా ఈ గోవులు రైతులవని గోశాల నిర్వాహకులు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. గోశాల నిర్వాహకులతో అధికారులు లాలూచీ పడ్డారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా నక్కపల్లి సీఐ విజయకుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గోశాల ప్రాంగణాన్ని బీజేపీ నాయకులు, ధార్మిక సంఘ సభ్యులతో కలిసి ఆమె పూర్తి స్థాయిలో పరిశీలించారు.

సీఐ చొరవతో ఆందోళన విరమణ..

గోశాల వద్ద ఆందోళన చేస్తున్న కరాటే కల్యాణి వద్దకు కొత్తవలస సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో వచ్చి ఆమెతో చర్చించారు. ఇక్కడ ఉన్న పశువులను తక్షణమే శ్రీకాకుళం జిల్లా బారువా గోశాలకు తరలిస్తామని, సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని, గోశాల నిర్వహణపై విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో కల్యాణి ఆందోళన విరమించారు.

వ్యక్తి ఆత్మహత్య



అజయ్‌కుమార్(ఫైల్)

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాగాటి అజయ్‌కుమార్ (35) పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అయితే ఇతను మద్యానికి బానిసై అప్పులు చేస్తుండడంతో భార్య రమాదేవి ఎప్పటికప్పుడు మందలించేది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఇంటిలో ఉరి వేసుకున్నాడు. వెంటనే స్థానికులు స్పందించి అజయ్‌ను ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించగా...అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు స్పష్టం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ఓజీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ గారు ఇక లేరు

- గుండెపోటుతో హఠాన్మరణం



డాక్టర్ శెట్టి మధుసూదన్‌రావు (ఫైల్)

కొమరాడ: జిల్లాలోని కొమరాడ మండలం మాదలింగి గ్రామానికి చెందిన డాక్టర్ శెట్టి మధుసూదన్‌రావు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు. ఇంతవరకు మండల ప్రజలకు రాజకీయంగా, వైద్యపరంగా ఎన్నో సేవలు అందించిన ఆయన ఇక లేరన్న వార్త తెలియగానే మండలంలోని వైస్సార్‌సీపీ శ్రేణులతో పాటు, పార్టీ నాయకులు, ప్రజలు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల భర్త డాక్టర్ మధుసూదన్ రావు వైస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిగా మండలంలో పార్టీకి తన సేవలు అందించారు. ఆయన శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గుండెపోటుతో ఇంటి వద్ద హఠాన్మరణం చెందారన్న విషయం తెలుసుకున్న వెంటనే వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన రావు, పార్టీ నాయకులు కళింగ మల్లేశ్వర రావు, వైస్ ఎంపీపీ సంగిరెడ్డి శరత్ బాబుతో పాటు పలువురు సీనియర్ నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి డాక్టర్ మధుసూదన రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

జెడ్పీచైర్మన్ దిగ్భ్రాంతి

విజయనగరం రూరల్: కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల భర్త డాక్టర్ మధుసూదనరావు ఆకస్మిక మృతి పట్ల, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ఎంపీపీ శ్యామలకు ఫోన్ చేసి పరామర్శించారు. ఇలాంటి కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

శారద కళావేదిక ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి శారద కళావేదిక ప్రారంభిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్ సంక్షేమ ఆంగ్ల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 'శారద కళావేదిక' అందుబాటులో ఉంటుందని ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. శారద మెటల్స్, అల్లాయిస్ కంపెనీ సౌజన్యంతో నూతనంగా నిర్మించిన శారద కళావేదికను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్ సంక్షేమ ఆంగ్ల పాఠశాల రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఇప్పటికే అనేక సౌకర్యాలతో కార్పొరేట్ స్కూల్స్‌కి దీటుగా తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. కొత్తవలసకు చెందిన శారద మెటల్స్ అండ్ అల్లాయిస్ కంపెనీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాల ఆవరణలో కళావేదికను నిర్మించడం అభినందనీయమన్నారు. శారద మెటల్స్ కంపెనీ సీనియర్ జీఎం. ప్రభాత్ మోహన్ మాట్లాడుతూ.. తమ కంపెనీ తరపున సేవా కార్యక్రమాలు చేపట్టే క్రమంలో ఎక్కువగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుంటామన్నారు. అందులోభాగంగానే ఈసారి పోలీస్ సంక్షేమ పాఠశాలను ఎంపిక చేసి కళావేదిక నిర్మించామని తెలిపారు. అనంతరం కంపెనీ యాజమాన్యం పాఠశాల విద్యార్థులకు పెన్సిళ్లు, కేకులను ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎం ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ యానివర్స్, శారద మెటల్స్ కంపెనీ సీనియర్ జీఎం విజయభాస్కర్, డీజీఎం హెచ్.సన్యాసిరావు, ఎస్‌బీ సీఐ కేకేవీ విజయనాథ్, ఆర్‌ఐలు ఎస్.గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్, భగవాన్, వెల్ఫేర్ ఆర్‌ఐ వరప్రసాద్, ఎస్సై అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ పి.సంధ్య, పలువురు ఆర్ఎస్సైలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితులు ఎదుర్కోవడానికి సిద్ధం..

- విపత్తుల శాఖ డీపీఎం రాజేశ్వరి



ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తున్న అధికారులు



హాజరైన యూత్ వలంటీర్లు

విజయనగరం అర్బన్: ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని విపత్తుల శాఖ డీపీఎం రాజేశ్వరి తెలిపారు. విపత్తులు సంభవించినపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. శనివారం స్థానిక యూత్ హాస్టల్‌లో యూత్ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలను చైతన్యపరచాలన్నారు. వరదలు, తుఫాన్లు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, గుండె పోటు సంభవించేటప్పుడు, పిడుగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. జిల్లాలో విజయనగరం, గంట్యాడ, గజపతినగరం, నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం, సంతకవిటి, వంగర, బొబ్బిలి మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రత్నం, ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధులు, యూత్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో కిడ్నాప్ కలకలం...

- ఆలస్యంగా వెలుగులోకి..
- రాజస్థాన్‌కి చెందిన ఆరుగురు కలిసి కిడ్నాప్‌కు పాల్పడిన వైనం
- వీడియోలు వైరల్ చేయడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

విజయనగరం క్రైమ్: పట్టణంలో కిడ్నాప్ కలకలం చోటుచేసుకుంది. కిడ్నాప్ చేసిన వ్యక్తిని కారులో ఎక్కించి చితకబాదేసి, మూత్రం తాగించి రూ. 50 వేలు డబ్బులు తీసుకుని వదిలేశారు. రాజస్థాన్ వెళ్లి ఆ వీడియోలను వైరల్ చేయడంతో బాధితుడి కుటుంబ సభ్యులు చూసి తీవ్ర మనస్థాపానికి గురై శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కి చెందిన భగవాన్ రామ్ కుటుంబ సభ్యులతో కలిసి ఐదారేళ్లుగా విజయనగరం పట్టణంలోని డకినివీధిలో నివాసం ఉంటున్నాడు. గ్యాస్‌స్టవ్ అమ్మకాలు చేపడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రాజస్థాన్‌లో తన ఇంటి పక్కన ఉండే బీజూరామ్ అనే వ్యక్తితో భగవాన్‌రామ్‌కు తగాదాలుండేవి. సడన్‌గా రాజస్థాన్ నుంచి బిజూరామ్ ఈ నెల 14న విజయనగరం వచ్చి మయూరీ కూడలి వద్ద నుంచి భగవాన్ రామ్‌కి ఫోన్ చేసి కలుస్తానని చెప్పాడు. అయితే వారిద్దరి మధ్య ప్రస్తుతం ఎటువంటి తగాదాల్లేకపోవడంతో సరేనని చెప్పి భగవాన్‌రామ్ కలిశాడు. అనంతరం మద్యం తాగేందుకు వై జంక్షన్ సమీపంలో ఉన్న దాబా వద్దకు వెళ్లారు. అక్కడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతంలో ఉన్న స్టార్ హోటల్‌కి వెళ్దామని కారులో వెళ్లారు. ఆ సమయంలో కారులో భగవాన్‌రామ్, బిజూరామ్‌తో మరో నలుగురున్నారు. కారును విశాఖ మీదుగా తణుకు వైపు తీసుకెళ్లడంతో అనుమానం వచ్చిన భగవాన్ రామ్ కేకలు పెట్టగా.. మా కుటుంబ సభ్యురాలికి ఫోన్ చేసి మాట్లాడతావా.. అని చెప్పి రాడ్డులు, కర్రలతో దాడి చేశారు. అప్పటికే బాటిల్‌తో ఉంచిన మూత్రాన్ని తాగించారు. తాము బెంగుళూరు నుంచి రావడానికి చాలా ఖర్చయిందని, లక్ష రూపాయలు ఇస్తేనే విడిచిపెడతామని చెప్పడంతో భగవాన్‌రామ్ తన మిత్రులకు ఫోన్ చేసి రూ. 50 వేల వరకు అందించాడు. ఆ డబ్బు తీసుకుని వారు భగవాన్ రామ్‌ను తణుకులో వదిలేసి పరారయ్యారు. అయితే రాజస్థాన్ వెళ్లిన తర్వాత వారు చేసిన ఆకృత్యాలను సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో భగవాన్‌రామ్ కుటుంబ సభ్యులు తీవ్ర మనస్థాపానికి గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్సై తారకేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్టుకున్నవాడే కడతేర్చాడు..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితుడు)



హత్యకు ఉపయోగించిన నైలాన్ తాడు, గ్లౌజ్‌లు

గజపతినగరం : మండలంలోని బంగారమ్మపేటలో ఇటీవల ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోవడంతో కేసు నమోదు చేసిన పోలీసులు అది ఆత్మహత్య కాదు...హత్య అని తేల్చారు. కట్టుకున్న భర్తే భార్యను అమానుషంగా చంపడంతో అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు శనివారం స్థానిక గజపతినగరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. బంగారమ్మపేటకు చెందిన నక్కా జగదీష్‌కు అదే గ్రామానికి చెందిన తాడుతూరి అనూష (తనూజ)తో మూడు నెలల కిందట వివాహం జరిగింది. మొదట్లో వీరి కాపురం సజావుగా సాగినా, జగదీష్‌కు అనుమానం ఎక్కువ కావడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. అక్కడకు కొద్ది రోజుల తర్వాత అనూషను కన్నవారింటిలో ఉంచి జగదీష్ ఉద్యోగం నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. ఈ నెల 16న గ్రామానికి వచ్చిన జగదీష్ అనూషకు ఫోన్ చేసి ఇంటి సమీపంలో ఉన్న పశువుల శాల వద్దకు రమ్మన్నాడు. దీంతో ఆరోజు (ఆదివారం) రాత్రి అనూష తన ఇంటి సమీపంలోని పశువులశాల వద్దకు రాగా.. ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. సహనం కోల్పోయిన జగదీష్ భార్య మెడకు నైలాన్ తాడుతో ఉరి వేశాడు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన బోని ప్రసాద్ అనే వ్యక్తి తనను వేధిస్తున్నాడని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని అనూష సెల్ నుంచి ఆమె తండ్రి, సోదరుడు, స్నేహితురాళ్లతో పాటు తన సెల్‌కు కూడా జగదీష్ మెసేజ్‌లు పంపించాడు. దీంతో మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు బోని ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారించగా.. అతను నేరం చేయలేదని తేలింది. ఈ పరిస్థితుల్లో భర్త జగదీష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా... అసలు విషయం బయట పడింది. భార్యను తనే హత్య చేసినట్లు జగదీష్ ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బోని ప్రసాద్ ఇంటిపై దాడి

తన కుమార్తె మృతికి కారణమనే అపోహతో అనూష తండ్రి, కుటుంబ సభ్యులు ప్రసాద్ ఇంటిపై దాడి చేసి అతని తండ్రి గోవిందరావుపై దాడి చేశారు. దీంతో గోవిందరావు ఫిర్యాదు మేరకు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో స్థానిక సీఐ ఎస్‌వీ ప్రభాకరరావు, ఎస్సై యు.మహేష్, తదితరులు పాల్గొన్నారు.